**విలేఖర్లు కావలెను**

జ్యోతి ప్రభంజనం దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో జిల్లాలకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్ సి ఇన్చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను.

**సంప్రదించ వలసిన నెంబర్:**

**7095999737,9908103501**



PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక:10 ఎడిటర్: రాపోలు లింగస్వామి 10 -09 -2026 గురువారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00


## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరు సభ్య సమాజానికి అవమానకరం



హైదరాబాద్, సెప్టెంబర్ 9: కేసీఆర్ ఫాంహౌస్ వద్ద 'శుద్ధి' అంశం తెలంగాణ అసెంబ్లీలో తీవ్ర రచ్చకు దారి తీసింది. బీఆర్ఎస్ తీరుపై మంత్రులు మండిపడ్డారు. స్పీకర్‌ను అవమానించడం, నిరసన ప్రాంతాన్ని శుద్ధి చేయడంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సభాపతిని అందరూ గౌరవించాలని అన్నారు. పదేళ్లు మంత్రులుగా చేసిన వారు స్పీకర్‌ను అగౌరవరిచేలా వ్యవహరించడం సరికాదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరు సభ్య సమాజానికి అవమానకరమని.. వారు చేసిన అవమానాలు ఇక చాలని ఉపముఖ్యమంత్రి అన్నారు. కా భరించే ఓపిక సమాజానికి లేదని తెలిపారు. దళితులు తిరిగారని రోడ్ల పై పసుపు నీళ్లు చల్లుతారా అంటూ ఫైర్ అయ్యారు. 'మనం ఏ సమాజంలో ఉన్నాం.. మీ ఛాలెంజ్‌లకు, బెదిరింపులకు భయపడేవారు ఎవరూ లేరు. బీఆర్ఎస్ సభ్యులు ఎవరిని బెదిరిస్తున్నారు. ఎంతకాలం దాడులు చేస్తారు. ఇది ఆత్మగౌరవ సమస్య. ఇంకా అవమానాలు భరించడానికి మేము సిద్ధంగా లేము. ఈ ప్రభుత్వం స్పీకర్‌కు అండగా నిలబడుతుంది' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## ఫాంహౌస్‌లో కుట్రపై సమగ్ర విచారణ




హైదరాబాద్, సెప్టెంబర్ 9: బీఆర్ఎస్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫాంహౌస్‌లో కుట్రకు ప్రణాళికలు రూపొందించారని ఆరోపించారు. సభను అడ్డుకోవాలని బీఆర్ఎస్ సభ్యులు కుట్ర చేశారని ధ్వజమెత్తారు. బుధవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి పలు అంశాలపై మాట్లాడారు. మూడు రోజుల ఘటనలకు ఫాంహౌస్ సాక్షిగా కుట్ర జరిగిందని ఆరోపించారు. అసెంబ్లీ ఘనటలపై విచారణకు ఆదేశించామని అన్నారు. దళితులను ఉద్దేశపూర్వకంగా అవమానించడం.. శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం. విద్వేషాలు,అల్లర్లు రెచ్చగొట్టడం నేరమని హెచ్చరించారు. దళితులపై అణచివేత, దురాగతాలకు పాల్పడిన వారిని.. చట్టపరంగా శిక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కుట్ర చేసిన వారితో పాటు అమలు చేసిన వారిని.. కోర్టులో నిలబెట్టి శిక్షించాలని నిర్ణయించామని అన్నారు.

విచారణ అధికారిగా ఐపీఎస్ విజయ్‌కుమార్..

ఈ ఘటనలపై సమగ్ర విచారణ చేపట్టాలని నిర్ణయించామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. విచారణ అధికారిగా ఐపీఎస్ విజయ్‌కుమార్‌ను నియమించామని వెల్లడించారు. ఈనెల 6వ తేదీన ఫాంహౌస్‌లో కుట్ర జరిగిందని ఆరోపించారు. 7వ తేదీన స్పీకర్‌పై మాటల దాడి జరిగిందని అన్నారు. 8వ తేదీన శుద్ధి కార్యక్రమం చేపట్టారని తెలిపారు. ప్రత్యక్షంగా పాల్గొన్న వారితో పాటు.. కుట్ర చేసిన అందరిపైనా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కోర్టు బెయిల్ ఇవ్వొచ్చేమో గానీ.. సమాజం మాత్రం బెయిల్ ఇవ్వదని చెప్పారు. అసెంబ్లీ ఘనటలపై విచారణకు ఆదేశించామని పేర్కొన్నారు.

## పోలీసులు దాడి చేసిన తీరును గవర్నర్‌కు వివరించాం



అసెంబ్లీ ముందు మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు చేసిన దాడి చేసిన తీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూ టీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆధ్వర్యంలో ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గవర్నర్ శుక్లాకు ఫిర్యాదు చేశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ లాంటి పరిస్థితిని వివ రించడానికి వారిని సమయం అడిగాం.. మాకు సమయం ఇచ్చారు. వారికి మా పార్టీ పక్షా న ధన్యవాదాలు తెలియ జేస్తున్నాం. వారికి చిన్న ఆరోగ్యసమస్య వచ్చింది.. వారు సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని మనస్ఫూర్తిగా మా పార్టీ తరపున ఆకాంక్షను తెలియజేశామన్నారు. ఇవాళ ఈ రాష్ట్రంలో నెలకొన్ని అన్ని పరిస్థితులను గవర్నర్‌కు కూలంకషంగా మా పార్టీ శాసనసభ్యులు, శాసన మండలి లో ప్రతిపక్ష నాయకులు, ఉప నాయకులు, సీనియర్ నాయకులు అంతా కలిసి చాలా వివరంగా గవర్నర్‌కు చెప్పామన్నారు. కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనలో ప్రజలకు అన్యాయమే జరిగిందని నల్ల టీ-షర్టులు ధరించి నిరసన తెలుపుతుంటే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసులను అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై గవర్న ర్‌కు ఫిర్యాదు చేశామని కేటీఆర్ పేర్కొన్నారు. అసెంబ్లీకి రానివ్వ కుండా పోలీసులు దాడి చేసిన తీరును, తెలంగాణలో పరిస్థితు లను గవర్నర్‌కు వివరించామ న్నారు. శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డిపై పురుష పోలీసుల దాడి వీడియోలను చూపించాం. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలను తెలిపామన్నారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను లాగి దుశ్శాసనపర్వం ఎలా సృష్టించారో చెప్పామన్నారు. కేసీఆర్ చావు కోరుతూ ఎలా మాట్లాడారో గవర్నర్‌కు చెప్పామన్నారు.

## సీఎంపై మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలు.. అసెంబ్లీ స్పీకర్ అభ్యంతరం



హైదరాబాద్, సెప్టెంబర్ 9: సీఎం రేవంత్‌రెడ్డిని ఏకవచనంతో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడారని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ధ్వజమె త్తారు. ఏలేటి చేసిన వ్యాఖ్యలపై స్పీకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఎంను అవమానపరి చి, ఏకవచనం ప్రయోగిస్తుంటే ఏం చేయాలి? అని ప్రశ్నించారు. మహేశ్వర్ రెడ్డి కూడా ఏకవచనం ప్రయోగిస్తున్నారని అన్నారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కోరారు. సభలో మైక్ ఇస్తే సీఎం రేవంత్‌రెడ్డిని ఏకవ చనంతో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడటం సరికాదని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఏలేటి ఇలా మాట్లాడటం బాధాకరమని ధ్వజమెత్తారు. సభ ఔన్నత్యాన్ని కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందని భట్టివిక్రమార్క పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఏకవచనంతో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడారని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడిన మాటలను వెనక్కు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. బుధవారం అసెంబ్లీలో మంత్రి సీతక్క మాట్లాడారు. పోడియంలో ఫ్ల కార్డులు ప్రదర్శించవద్దనే రూల్ ఉందని తెలిపారు. అయినా బీజేపీ నేతలు పోడియంలోకి వచ్చి ఫ్ల కార్డులు ప్రదర్శిస్తున్నారని చెప్పుకొచ్చారు.

## పలు కీలక నిర్ణయాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం



న్యూఢిల్లీ: బుధవారం కేంద్ర కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అందులో దేశవ్యాప్తంగా 8 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులను కేంద్ర కేబినెట్ ఆమోదించింది. దక్షిణాదిలో 5, ఉత్తరాదిలో 3 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు రానున్నాయి. తెలంగాణ, ఎపి, తమిళనాడు, కర్ణాటక పరిధిలో నాలుగు రాష్ట్రాల్లోని 17 జిల్లా పరిధిలో 5 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు రానున్నాయి. ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్ నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.2,419 కోట్లతో ఘట్‌కేసర్-కాజీపేట మధ్య (110 కి.మీ) నాలుగో లైన్ నిర్మాణం జరుగనుంది. అరక్కోణం-రేణిగుంట సెక్షన్‌లో 3, 4 లేన్ల నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ సెక్షన్‌లో 77 కి.మీ, పొడవుతో 3, 4 లేన్ల నిర్మాణం జరుగనుంది. ఉత్తరాదిలో ఐదు రాష్ట్రాల పరిధిలో 3 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

## రాయదుర్గంలో పాలిటెక్నిక్ విద్యార్థుల మెరుపు ధర్నా

కొండాపూర్,: పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ విద్యార్థులు రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో రాస్తారోకో చేపట్టారు. జీఓ 97ను వెంటనే రద్దు చేయాలని, తమ విద్యా భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు రాయదుర్గంలోని లిడ్క్యాప్ ముందున్న జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేటుపరం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని విద్యార్థులు ఆరోపించారు. తమను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో విలీనం చేయడం వల్ల విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

## అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

హైదరాబాద్, సెప్టెంబర్ 9: తెలంగాణ అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్



సభ్యులు సస్పెండ్ అయ్యారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సభ నుంచి సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్ బాబు ప్రతిపాదించారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అందరినీ ఈ సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిర్ణయం తీసుకున్నారు..

# సంపాదకీయం

## సామాన్యుడే సృష్టికర్త కావాలి!

మానవాళి చరిత్రలో అత్యంత శక్తిమంతమైన విప్లవం కృత్రిమ మేధస్సు (ఏఐ) ఎవరికి ఉపయోగపడుతుంది అనే చర్చ ఇప్పుడు సర్వత్రా సాగుతోంది. ఈ గొప్ప సాంకేతికత కేవలం బడా కార్పొరేట్లకే పరిమితమై వారి ధనదాహాన్ని తీర్చడానికే ఉపయోగపడుతుందా? లేక పూర్తిగా ప్రభుత్వాల చేతుల్లోకి వెళ్లి ప్రజలను నియంత్రించే సాధనంగా మారుతుందా? అనే భయాలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. అయితే ఇందుకు భిన్నంగా ఏఐని ప్రజాస్వామ్యీకరించితే అది మానవాళికి అంతులేని ప్రయోజనాలను కలిగిస్తుంది. ఏఐ ప్రజాస్వామ్యీకరణకు అనేక అవకాశాలు ఉన్నాయి. వాటిని ఆయా దేశాల ప్రభుత్వాలు, ప్రజా సమూహాలు అందిపుచ్చుకోవాలి. ప్రస్తుతం ఏఐ రంగంలో 'పర్సనల్ సూపర్ ఇంటెలిజెన్స్' టూల్స్ సరికొత్త మార్పులకు శ్రీకారం చుడుతున్నాయి. ఓపెన్ సోర్స్ విధానంలో లభించే ఈ టూల్స్... కేవలం పెద్ద పెద్ద టెక్ కంపెనీలకే పరిమితం కాకుండా సామాన్యుడికి కూడా అందుబాటులోకి వస్తున్నాయి. ఇప్పటి వరకు శక్తిమంతమైన ఏఐ టూల్స్‌ను ఉపయోగించాలంటే ఓపెన్ ఏఐ లేదా ఆంత్రోపిక్ వంటి సంస్థలకు భారీగా డబ్బు చెల్లించాలి. అయితే కొన్ని కంపెనీలు తమ మోడళ్ల 'ఓపెన్ వెయిట్స్'ను ఉచితంగా విడుదల చేయడంతో ఏఐ ప్రజాస్వామ్యీకరణకు మరింతగా ఊతం లభించింది. కోడింగ్ రాని సామాన్యుడు, చిన్న వ్యాపారి, విద్యార్థి కూడా ప్రపంచంలోనే అత్యంత సామర్థ్యవంతమైన ఏఐ టూల్స్‌ను ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో ఉపయోగించుకోవచ్చు. దీంతో ఏఐ సాంకేతికత కేవలం సిలికాన్ వ్యాలీలోని కొన్ని కంపెనీల చేతుల్లోనే ఉండిపోకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్కరి సొంతం అవుతుంది. భారత్ లాంటి దేశాలు ఈ ఓపెన్ సోర్స్ మోడల్స్‌ను ఉపయోగించి.. మన స్థానిక భాషలు (తెలుగు, హిందీ...), సంస్కృతికి అనుగుణంగా సొంత ఏఐ వ్యవస్థలను తయారుచేసుకోవచ్చు. పర్సనల్ సూపర్ ఇంటెలిజెన్స్ టూల్స్ ప్రతి ఒక్కరికీ ఒక 'వ్యక్తిగత మేధావి'లాగా తోడుంటాయి. ఇది మానవ ఆలోచనలకు రెక్కలు తొడుగుతుంది. ఈ ఓపెన్ సోర్స్ టూల్స్ ద్వారా సాఫ్ట్‌వేర్ లేదా అప్లికేషన్లను ఇంట్లోనే కూర్చుని డిజైన్ చేయవచ్చు. ఒక చిన్న ఆలోచన ఉన్న వ్యక్తి, ఈ టూల్స్ సహాయంతో కోడింగ్ నేర్చుకుని, రాత్రికి రాత్రే ఒక కొత్త యాప్‌ను లేదా వ్యాపార నమూనాను సృష్టించగలడు. విద్యార్థులు, శాస్త్రవేత్తలు క్లిష్టమైన డేటాను విశ్లేషించడానికి, కొత్త ఆవిష్కరణలు చేయడానికి ఈ టూల్స్ అపరిమితమైన శక్తిని ఇస్తాయి. ఓపెన్ సోర్స్ ఏఐ మోడళ్లను ఉపయోగించి సొంత ఏఐ ఏజెంట్లను రూపొందించుకోవచ్చు. వీటిని అనుకూలమైన సొంత కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని, కొన్ని సందర్భాల్లో ఇంటర్నెట్ లేకుండా కూడా ఉపయోగించుకోవచ్చు. ఈ విధమైన ఏర్పాటు వల్ల వ్యక్తిగత డేటాను బయటి క్లౌడ్ సర్వర్లకు పంపాల్సిన అవసరం తగ్గి, గోప్యతను మెరుగ్గా కాపాడుకునే అవకాశం ఉంటుంది. మరోవైపు ఏఐ ఏజెంట్ల వాడకం ద్వారా వారు శ్రమించే సమయం తగ్గిపోతోంది. వారి పనిలో క్రియేటివిటీ పెరుగుతుంది. భారీ సర్వర్లు, క్లౌడ్ సబ్‌స్క్రిప్షన్ల అవసరం లేకుండా తక్కువ ఖర్చుతోనే ఏఐ సేవలను పొందుతారు. అందరూ వాడుకునేలా, మనకు అనుకూలమైన ఓపెన్ సోర్స్ ఏఐ టూల్స్‌ను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించాలి. ఇందుకు చొరవ తీసుకునేలా సర్కారుపై ప్రజా సమూహాలు ఒత్తిడి తేవాలి. పర్సనల్ సూపర్ ఇంటెలిజెన్స్ అనేది మానవాళికి లభించిన ఒక గొప్ప వరం. ఇది ప్రతి సామాన్యుడిని ఒక ఆవిష్కర్తగా మార్చగల శక్తిని కలిగి ఉంది. అయితే, ఈ సాంకేతికత దుర్వినియోగం కాకుండా చూడటానికి సరైన ప్రభుత్వ నిబంధనలు, నైతిక బాధ్యత అవసరం. సాంకేతికతను బాధ్యతాయుతంగా వాడినప్పుడు మాత్రమే ఏఐ ప్రజాస్వామ్యీకరణ నిజమైన ప్రగతికి బాటలు వేస్తుంది.

# ఫేక్ మార్ఫింగ్, ఏఐ జనరేటెడ్ చిత్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

### డీజీపీకి బీఆర్ఎస్ శాసనసభాపక్షం ఫిర్యాదు

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 09:బీఆర్ఎస్ పార్టీకి



చెందిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా, ఇతర డిజిటల్ వేదికలపై మార్ఫింగ్ చేసిన తప్పుడు చిత్రాలు, ఏఐ ద్వారా రూపొందించిన చిత్రాలు, దుష్ప్రచార కంటెంట్‌ను ప్రచారం చేస్తున్న వారిపై తక్షణమే దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ శాసనసభాపక్షం డిమాండ్ చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ చారి తదితరులు బీఆర్ఎస్ శాసనసభాపక్షం తరపున తెలంగాణ డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేష్ మురళీధర్ భగవత్, ఐ పి ఎస్ కు ఫిర్యాదు అందజేశారు. అసెంబ్లీ ఘటన నుంచి దృష్టి మరల్చేందుకేనా?రెండు రోజుల క్రితం తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులపై జరిగిన దాడి, దురుసు ప్రవర్తన ఘటనల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ఉద్దేశపూర్వకంగా ఫేక్ డిజిటల్ కంటెంట్‌ను సృష్టించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫేక్ లేదా ఏఐ ద్వారా రూపొందించిన చిత్రాలను నిజమైనవిగా చూపిస్తూ ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి చెందడమే కాకుండా, ఎన్నికైన ప్రజాప్రతినిధుల ప్రతిష్ఠకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని బీఆర్ఎస్ శాసనసభాపక్షం ఆందోళన వ్యక్తం చేసింది. సైబర్ క్రైమ్ విభాగంతో దర్యాప్తుఫేక్, మార్ఫింగ్, ఏఐ జనరేటెడ్ చిత్రాలు, పోస్టులను గుర్తించి సైబర్ క్రైమ్ విభాగం వెంటనే దర్యాప్తు చేపట్టాలని బీఆర్ఎస్ నేతలు కోరారు. ఈ కంటెంట్‌ను ఎవరు రూపొందించారు? ఎవరు అప్‌లోడ్ చేశారు? ఎవరు విస్తృతంగా ప్రచారం చేశారు? అనే అంశాలపై సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సంబంధిత చిత్రాలు, పోస్టులపై సాంకేతిక ఫోరెన్సిక్ దర్యాప్తు నిర్వహించి, డిజిటల్ ఆధారాలు, సోషల్ మీడియా ఖాతాల వివరాలు, యూ ఆర్ ఎల్ లు, టైమ్‌స్టాంప్‌లు, అందుబాటులో ఉన్న మెటాడేటాను భద్రపరచాలని కోరారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలుసైబర్ నేరాలు, పరువునష్టం, తప్పుడు సమాచార ప్రచారం తదితర అంశాలకు వర్తించే చట్టాల ప్రకారం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ శాసనసభాపక్షం డిమాండ్ చేసింది. ఫేక్ కంటెంట్ మరింతగా వ్యాప్తి చెందకుండా అవసరమైన చర్యలు తీసుకుని ఎన్నికైన ప్రజాప్రతినిధుల గౌరవాన్ని కాపాడాలని కోరింది. రాజకీయ భేదాలు ఉన్నాయనే కారణంతో ఎన్నికైన ప్రజాప్రతినిధులపై కల్పిత డిజిటల్ కంటెంట్‌ను తయారు చేసి ప్రచారం చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని బీఆర్ఎస్ శాసనసభాపక్షం స్పష్టం చేసింది. అసెంబ్లీ ఘటనపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలో పోలీసుల వైఖరిపై కూడా సమగ్ర దర్యాప్తు జరిపించాలని, ఘటనకు సంబంధించి బాధ్యులైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

# తాతా మధు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

### బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు బాకి నరసింహ

నల్లగొండ సెప్టెంబర్ 9, జ్యోతి ప్రభంజనం ప్రతినిధి: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దళితుడని తెలిసి కూడా ఉద్దేశపూర్వకంగా అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన తాతా మధు



పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, స్పీకర్ కి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు బాకి నరసింహ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాతా మధు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని, ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్, కేటీఆర్‌లు దళిత సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు. దళిత సమాజానికి చెందిన స్పీకర్ ని అవమానించడం అంటే మొత్తం దళిత సమాజాన్ని అవమానించడమే అనిఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్యంలో హేయమైన చర్యలు అని పేర్కొంటూ తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు.

# గుండె చప్పుళ్ళు

మనిషి అస్తిత్వానికి తొలి సాక్ష్యం గుండె చప్పుడు,



మరణ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ సాగే జీవన ప్రకటన.
దానికి విశ్రాంతి లేదు, విరామం లేదు,
కాలగర్భంలో క్షణక్షణం కర్తవ్యాన్ని చెక్కే కర్మయోగి అది.
శరీరం శిథిలమైనా స్పందనను శాసించే శక్తి అది,
రక్తనాళాల చీకటి మార్గాల్లో వెలుగును మోసే రథసారథి.
మనిషి తన ఉనికిని మరచిపోయినా,
అంతరంగపు అగాధంలో అది మనల్ని మనకు పరిచయం చేస్తుంది.
ప్రతి చప్పుడు కాలానికి వేసిన ఒక సంతకం,
ప్రతి స్పందన మరణానికి విసిరిన ఒక సవాలు.
నిశ్శబ్దంగా కొట్టుకుంటూనశ్వరత్వంపై నిత్యత్వపు భ్రమను నిర్మిస్తుంది.
సంతోషం దానిని ఉప్పొంగించే అల,
వేదన దానిని లోపలినుంచి కొరికే విషపు దంతం.
ప్రేమ దానిలో ప్రళయాన్ని రేపుతుంది,
విరహం దాని గర్భంలో శూన్యాన్ని నాటుతుంది.
ఆశకు అది అగ్నికణం,
నిరాశకు అది ఆరిపోని బూడిద.
బాధ్యతల బండరాళ్ల కింద నలిగినా,
బ్రతుకుపై తన తిరుగుబాటును ఆపదు.
కాలం శరీరంపై వృద్ధాప్యాన్ని చెక్కుతున్నా,
గుండె మాత్రం ప్రతి చప్పుడుతో యవ్వనాన్ని ప్రకటిస్తుంది.
చివరి స్పందన దాకాప్రాణం అనే యుద్ధభూమిలో ఒంటరి యోధుడిలా నిలుస్తుంది.
ఒక రోజు ఆ చప్పుడు ఆగిపోతుంది,
శ్వాస తన చివరి వాక్యాన్ని ముగిస్తుంది.
అప్పుడు మిగిలేది శరీరం కాదు జ్ఞాపకం,
గుండె చప్పుడు కాదు మనం జీవించినదానికి మిగిలిన ప్రతిధ్వని.

రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.చరవాణి : 9866179385

# డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

### వాటర్ వర్క్స్ ఎండీని కలిసి వినతిపత్రం అందజేసిన మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం,సెప్టెంబర్ 9:వనస్థలిపురం డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డిని కలిసి సమస్యలను



వివరించారు. ఈ సందర్భంగా వనస్థలిపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు నిలిచిపోతూ కాలనీవాసులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వనస్థలిపురం డివిజన్‌కు అవసరమైన డ్రైనేజీ పనులను త్వరితగతిన మంజూరు చేసి, పెండింగ్ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డిని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంఈ సందర్భంగా రాగుల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, కాలనీలలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తామని పేర్కొన్నారు. వనస్థలిపురం డివిజన్ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు.

# పరిశుద్ధ వివాహ వేడుకలో పాల్గొన్న జనసేన నేత కనపర్తి మనోజ్ కుమార్

### నూతన వధూవరులకు ఆశీస్సులు అందజేసిన జనసేన పార్టీ మాజీ సమన్వయకర్త

కందుకూరు,జ్యోతి ప్రభంజనం,సెప్టెంబర్ 9: ప్రకాశం జిల్లా



కందుకూరు పట్టణంలోని ఎస్ వి ఎస్ కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన నూతన వధూవరులు సురేష్?అక్షల పరిశుద్ధ వివాహ మహోత్సవ వేడుకకు జనసేన పార్టీ కొండపి నియోజకవర్గ మాజీ సమన్వయకర్త కనపర్తి మనోజ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను కలిసి ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పొన్నలూరు మండల నాయకులు పత్తిపాటి మాధవరావు, మిడసల అనిల్, కందుకూరి కోటయ్య, హరిబాబు, శ్రీను, నిఖిల్ తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

చిట్యాల,నల్లగొండ: సెప్టెంబర్ 09(జ్యోతి ప్రభంజనం):చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామ సచివాలయం వద్ద కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని బుధవారం ఘనంగా నివాళులర్పించారు. గ్రామ సర్పంచి కాటం వెంకటేశం కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాళోజి నారాయణరావు తెలుగు సాహిత్యానికి, తెలంగాణ ప్రజల చైతన్యానికి అందించిన సేవలను పలువురు స్మరించుకున్నారు. ప్రజల సమస్యలను తన రచనల ద్వారా సమాజం దృష్టికి తీసుకువచ్చిన కాళోజి సాహితీ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన రచనలు ప్రజల్లో చైతన్యం కలిగించడంతో పాటు సామాజిక స్పృహను పెంపొందించాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య, ఉప సర్పంచి ఓర్సు సైదులు, వార్డు సభ్యులు జిల్లా ప్రశాంత్, ఏర్పుల మహేశ్వరి, వెంకన్న, ఆనగంటి నరేష్, గంట్ల తిరుమలరెడ్డి, నీలకంఠ నరేష్, గంట్ల పుల్లారెడ్డి, శిర్సు సైదులు, తోటకూరి బాలమల్లు తదితరులు పాల్గొన్నారు.

# నిజమైన బంధం

బంధంలో ఉండకూడనిది నిర్లక్ష్యం ఉండవలసినది
నమ్మకం
ఇవ్వవలసినది సమయం? ఇవ్వకూడనివి
మనసుకు బాధలు?
పుచ్చుకోవలసినవి ఆప్యాయతలు?
ఇచ్చుకోవలసినవి స్వచ్ఛమైన ప్రేమలు?
చెప్పకూడనివి అబద్ధాలు? చెప్పుకోవలసినవి
మధురమైన జ్ఞాపకాలు?
పెంచుకోవలసినవి బంధాలు?
పెంచుకోకూడనివి మనసుల మధ్య దూరాలు?
ఎప్పుడూ ఉండవలసినవి నవ్వులు?
కళ్లలో మెరుస్తూ ఉండాలి ఆనందం?
బంధం అంటే కేవలం కలిసి ఉండటం కాదు?
మనసుతో మనసును కలపడం?
మాటలకన్నా ముందే ఎదుటివారి మౌనాన్ని అర్థం చేసుకోవడం?
సంతోషంలో తోడుగా నవ్వడం?
కష్టాల్లో నీడలా నిలవడం?



కన్నీటి చుక్క జారకముందే ఆ బాధను గుండెతో గమనించడం?
నమ్మకం అనే పునాదిపై ప్రేమ అనే ఇంటిని నిర్మించడం?
ఆప్యాయత అనే వెలుగుతో ఆ ఇంటిని నిత్యం ప్రకాశింపజేయడం?
సమయం కేటాయించని బంధం?
నీరు లేని మొక్కలా వాడిపోతుంది?
నిర్లక్ష్యం చేరిన చోట?
అనుబంధం మెల్లగా దూరమవుతుంది?
ఒక చిన్న పలకరింపు కూడా?
పెద్ద ప్రేమకు చిరునామా అవుతుంది?
ఒక చిన్న చిరునవ్వు కూడా?
అలసిన మనసుకు ఓదార్పవుతుంది?
మనసులను గాయపరిచే మాటలకంటే?
మౌనమైన ప్రేమే మేలని గుర్తించాలి?
కోపం క్షణికమే?
కానీ ఆ కోపంలో పలికిన మాటలు శాశ్వత గాయాలవుతాయి?
అందుకే బంధాలను గెలవాలి?
వాదనలను కాదు?మనుషులను కాపాడాలి?
మనసుల మధ్య ప్రేమను నిలబెట్టాలి?
క్షమించడం బలహీనత కాదు?
బంధాన్ని కాపాడే గొప్ప బలం?
అర్థం చేసుకోవడం ఒక గుణం కాదు?
నిజమైన ప్రేమకు ప్రతిరూపం?
ప్రతి కలయిక ఒక మధుర జ్ఞాపకంగా మిగలాలి?
ప్రతి మాట ఒక ఆత్మీయతగా?
ప్రతి క్షణం ఒక అనుభూతిగా మారాలి?
బంధం భారంగా అనిపించకూడదు?
భరోసాగా అనిపించాలి?
ఒంటరిగా ఉన్నప్పటికీ?
"నేనున్నాను" అనే నమ్మకం తోడుండాలి?
దూరాలు ఎంత పెరిగినా?
హృదయాల మధ్య అనుబంధం తగ్గకూడదు?
ప్రేమ ఉన్న చోట అసూయకు కాదు?
ఆప్యాయతకు చోటుండాలి?
ప్రతి హృదయంలో నమ్మకం?
ప్రతి జీవితంలో ప్రేమ?
ప్రతి పెదవిపై చిరునవ్వు ఉండాలి?
అందరూ నవ్వుతూ? నవ్విస్తూ?
ఆనందంగా, ఆప్యాయంగా?
ఎప్పటికీ కలిసి ఉండాలి.
రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.చరవాణి : 9866179385

# ఏకలవ్యలో విద్యాబోధనకు ప్రాధాన్యత ఇవ్వాలి

**- తరగతి సమయాల్లో ఇతర కార్యక్రమాలు నిర్వహించొద్దు**
**- ప్రయోగాత్మక విద్యపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచాలి**
**- పరిశుభ్రత, ఆహార నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి**
**- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ సూచన**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):ఏకలవ్య పాఠశాలలో విద్యాబోధనకు తొలి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు తరగతి సమయాల్లో ఇతర కార్యక్రమాలు నిర్వహించొద్దని ప్రయోగాత్మక విద్యపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచుతూ పరిశుభ్రత ఆహార నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. టేకులపల్లి మండలంలోని తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యాబోధన విద్యార్థుల హాజరు తరగతుల నిర్వహణ ప్రయోగశాలలు భోజనం పరిశుభ్రత యూనిఫాంలు వెల్నెస్ సెంటర్ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు.తరగతుల గదులను పరిశీలించిన కలెక్టర్ కొన్ని తరగతుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంపై ఆరా తీశారు. గ్రామసభ విద్యార్థి పార్లమెంట్ స్కాలర్‌షిప్‌కు సంబంధించిన బ్యాంకు ఖాతాల ప్రారంభం వంటి కార్యక్రమాల కోసం విద్యార్థులు తరగతులకు దూరంగా ఉన్నట్లు అధికారులు వివరించారు. ఆర్ట్ అండ్ డ్రాయింగ్ తరగతిని పరిశీలించి బోధిస్తున్న అంశాలను తెలుసుకున్నారు. 8వ తరగతి లైబ్రరీ పీరియడ్‌కు బదులుగా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తరగతి సమయాన్ని పూర్తిగా విద్యాబోధనకే కేటాయించాలని విద్యార్థులు ఉపాధ్యాయులు ఇతర కార్యక్రమాల్లో నిమగ్నం కాకుండా చూడాలని స్పష్టం చేశారు. గ్రామసభ విద్యార్థి పార్లమెంట్ బ్యాంకు ఖాతాల ప్రారంభం స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి కార్యక్రమాలను తరగతుల అనంతరం లేదా శనివారాల్లో నిర్వహించాలని ఆదేశించారు. విద్యా క్యాలెండర్ ప్రకారం ప్రతి పీరియడ్‌ను సక్రమంగా నిర్వహించి విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని సూచించారు. భౌతిక శాస్త్ర ప్రయోగశాలను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి ప్రయోగాలపై వారి అవగాహనను తెలుసుకున్నారు. పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలకు పరిమితం చేయకుండా ప్రయోగాత్మకంగా నేర్పడం ఎంతో ముఖ్యమని ప్రతి విద్యార్థి ప్రయోగాల్లో స్వయంగా పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ప్రయోగశాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం ఆసక్తి పెంపొందించేలా బోధన సాగాలని అన్నారు.కొత్తగా చేరిన కొంతమంది విద్యార్థులకు యూనిఫాంలు ఇంకా అందలేదని ప్రిన్సిపల్ వివరించడంతో అర్హులైన విద్యార్థులందరికీ యూనిఫాంలు త్వరగా అందేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.పరిశుభ్రత లోపాలపై కలెక్టర్ అసంతృప్తి...భోజనశాల వంటగది మరుగుదొడ్లను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రత లోపాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల భోజనశాల వంటగది



మరుగుదొడ్లు పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన పరిశుభ్రమైన ఆహారం అందేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. వంట సిబ్బందితో మాట్లాడి విద్యార్థులకు అందుతున్న ఆహారం వివరాలను తెలుసుకున్నారు. ప్రధాన వంట మనిషి అనారోగ్యంతో సెలవులో ఉన్నట్లు తెలియడంతో విద్యార్థులకు భోజనంలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ వంట మనిషిని వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్టోర్ రూమ్‌లోని కూరగాయలు రిఫ్రిజిరేటర్‌లోని పాలు పెరుగు నాణ్యతను పరిశీలించిన కలెక్టర్ ఫుడ్ సేఫ్టీ అధికారుల ద్వారా నాణ్యత పరీక్షలు నిర్వహించాలని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం మాత్రమే అందేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని వెల్నెస్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్ అక్కడ అందుబాటులో ఉన్న మందులను తనిఖీ చేశారు. మందుల నిల్వ వినియోగానికి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విద్యాబోధన ప్రయోగాత్మక విద్య ఆహారం పరిశుభ్రత ఆరోగ్యం హాజరు తదితర అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులు తమ బాధ్యతలను పూర్తి జవాబుదారీతనంతో నిర్వహిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని ఆదేశించారు.ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట తాసిల్దార్ వీరభద్రం, ఎంపీడీవో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నెల రోజులుగా డ్రైనేజీ లీకేజీ.. అధికారులు పట్టించుకోరా?

**బిర్లామందిరం మార్గంలో దుర్వాసనతో ఇబ్బందులు**
**ఆటో డ్రైవర్ల అవస్థలు.. సీఐటీయూ నేతల పరిశీలన**
**మూడు రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే ఆందోళనకు సిద్ధం**

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం,సెప్టెంబర్ 9:అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ప్రధాన రహదారిపై నెల రోజులుగా డ్రైనేజీ లీకేజీ కొనసాగుతున్నా పట్టించుకోవడం లేదని సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా నాయకులు పి. నాగేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీ శాఖ కార్యాలయ ప్రహరీ పక్కన డ్రైనేజీ లీకేజీ కారణంగా మురుగునీరు రోడ్డుపైకి చేరి పరిసర ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోందని తెలిపారు.బిర్లామందిరానికి వెళ్లే పర్యాటకులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అక్కడే ప్రజలకు సేవలందిస్తున్న ఆటో డ్రైవర్లు దుర్వాసన కారణంగా నిలబడలేని పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. తక్షణమే అటవీ శాఖ పరిధిలో పగిలిపోయిన డ్రైనేజీ పైపులను మార్చి, మురుగునీరు ప్రధాన రోడ్డుపైకి రాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని అధికారులను డిమాండ్ చేశారు.స్థానికుల ఫిర్యాదుతో పరిశీలనఅటవీ శాఖ భవనం నుంచి నెల రోజులుగా డ్రైనేజీ లీకేజీ అవుతున్నప్పటికీ అధికారులు తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు సీఐటీయూ నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సమస్యను అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు టూరిస్ట్ గైడ్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకుడు ఎం.డి. బాబా, ఆటో డ్రైవర్లు షికందర్, నాజిమ్, అదిల్, ఎం.డి. గౌస్ సుద్దీన్ తదితరులతో కలిసి పి. నాగేశ్వర్ అటవీ శాఖ కార్యాలయాన్ని సందర్శించారు.అందుబాటులో ఉన్న సిబ్బందితో సమస్యపై చర్చించి, తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సమస్యను



పై అధికారులకు తెలియజేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సిబ్బంది హామీ ఇచ్చారు.మూడు రోజుల్లో పరిష్కరించాలిఅనంతరం ఆటో డ్రైవర్లతో పి. నాగేశ్వర్ మాట్లాడుతూ మూడు రోజుల్లోగా డ్రైనేజీ లీకేజీ సమస్యను పరిష్కరించకపోతే స్థానిక ప్రజలు, ఆటో డ్రైవర్లతో కలిసి అటవీ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రజలకు, పర్యాటకులకు ఇబ్బందులు కలిగించే సమస్యలను అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పిండి వంటలు నూతన బ్రాంచ్ ఘనంగా ప్రారంభం

ఎల్ బీ నగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, సెప్టెంబర్ 09:వనస్థలిపురం టీవీ కాలనీలో శ్రీ లక్ష్మి తెలంగాణ పిండి వంటలు నూతన బ్రాంచ్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రవి కుమార్ మాట్లాడుతూ తెలంగాణ



సంప్రదాయ రుచులను ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో నాణ్యమైన పిండి వంటకాలను తయారు చేసి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.తెలంగాణకు ప్రత్యేకమైన సాంప్రదాయ పిండి వంటలు, ఇంటి రుచిని తలపించే రుచికరమైన వంటకాలను పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేసి వినియోగదారులకు అందిస్తున్నామని పేర్కొన్నారు. నాణ్యత, రుచి, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ తమ సేవలను కొనసాగిస్తామని తెలిపారు.నూతన బ్రాంచ్ ప్రారంభంతో స్థానిక ప్రజలకు తెలంగాణ సంప్రదాయ పిండి వంటలు మరింత చేరువ కానున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, స్థానికులు, శ్రేయోభిలాషులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# కాళోజీ ఆశయాలను భావితరాలకు అందించాలి

**- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):ప్రజాకవి కాళోజీ నారాయణరావు సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రజాకవి పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ అంకిత్ కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలంగాణ భాష సాహిత్యం సంస్కృతి సామాజిక చైతన్యానికి విశిష్ట సేవలు అందించారని తెలిపారు. కాళోజీ కేవలం కవి మాత్రమే కాకుండా సామాజిక ఉద్యమకారుడిగా ప్రజా చైతన్యవేత్తగా తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణ మాండలిక భాషలో సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తూ సాధారణ ప్రజల జీవితాలు వారి కష్టాలు ఆశలు ఆకాంక్షలను తన రచనల్లో ప్రతిబింబించినందుకే ఆయనకు ప్రజాకవి అనే బిరుదు లభించిందని అన్నారు. కాళోజీ రచనలు ప్రజల్లో ధైర్యాన్ని సామాజిక అవగాహనను చైతన్యాన్ని పెంపొందించాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తన కవిత్వం ద్వారా సమాజం ముందుకు తీసుకువచ్చి మార్పు కోసం కృషి చేశారని గుర్తుచేశారు. సమాజంలోని అన్యాయాలు



అసమానతలపై తన రచనల ద్వారా గళమెత్తిన కాళోజీ ఆలోచనలు నేటికీ ప్రజలకు స్ఫూర్తినిస్తున్నాయని తెలిపారు.కాళోజీ నారాయణరావు సేవలను గుర్తించి ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారంతో సత్కరించడం గర్వకారణమని కలెక్టర్ అన్నారు. కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం ఆయనకు లభించిన అత్యున్నత గౌరవమని పేర్కొన్నారు.ప్రతి సంవత్సరం కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం ద్వారా తెలంగాణ భాష సాహిత్యం సంప్రదాయాలు సంస్కృతిపై ప్రజల్లో మరింత అవగాహన పెరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా యువత కాళోజీ రచనలు ఆయన జీవితం ప్రజా ఉద్యమాల్లో ఆయన పోషించిన పాత్రను తెలుసుకోవాలని సూచించారు. తెలంగాణ భాషా వైభవాన్ని సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ కాళోజీ చూపిన ప్రజా చైతన్య మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మావతి, కలెక్టరేట్ ఏఓ అనంత రామకృష్ణ, సీపీఓ సునీత, ఓఎస్డీ వెంకటరమణతో పాటు వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్‌డీ పట్టా అందుకున్న పబ్బు దేవేందర్

చిట్యాల,నల్లగొండ, జ్యోతి ప్రభంజనం,సెప్టెంబర్ 09:చిట్యాల మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పబ్బు దేవేందర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం 85వ స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. విశ్వవిద్యాలయంలోని పొలిటికల్ సైన్స్ విభాగంలో పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ పట్టా సాధించారు.ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 85వ స్నాతకోత్సవ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, విశ్వవిద్యాలయ ఉపకులపతి కుమార్ మొగులారం తదితరుల చేతుల మీదుగా పబ్బు దేవేందర్ పీహెచ్‌డీ పట్టాను స్వీకరించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన దేవేందర్ ఉన్నత విద్యలో పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ సాధించడం పట్ల వెలిమినేడు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, మిత్రులు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పబ్బు దేవేందర్ మాట్లాడుతూ తన విద్యాభ్యాసంలో తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహం, గురువులు అందించిన మార్గదర్శకత్వం ఎంతో కీలకమని తెలిపారు. తాను సాధించిన పీహెచ్‌డీ పట్టాను తన తల్లిదండ్రులు, గురువులకు అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు. వారి ప్రోత్సాహం, ఆశీస్సుల వల్లే ఈ విజయాన్ని సాధించగలిగానని అన్నారు.పొలిటికల్ సైన్స్‌లో పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందడం ద్వారా దేవేందర్



తన గ్రామానికి, మండలానికి గుర్తింపు తీసుకువచ్చారని పలువురు అభినందించారు. భవిష్యత్తులోనూ ఉన్నత విద్యా రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ పొందిన కొమ్ము శేఖర్ మాదిగ

తార్నాక, జ్యోతి ప్రభంజనం, సెప్టెంబర్ 09:సామాజిక ఉద్యమంతో పాటు ఉన్నత విద్యలోనూ రాణించిన కొమ్ము శేఖర్ మాదిగకు ఉ



స్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ నెల 8న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 85వ స్నాతకోత్సవంలో యూనివర్సిటీ ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అధ్యక్షతన, ముఖ్య అతిథిగా భారత్ బయోటెక్ ఫౌండర్, చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ కృష్ణ ఎల్లా హాజరయ్యారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం సమక్షంలో శేఖర్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు.ఉస్మానియా యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ప్రొఫెసర్ వై. పార్థసారథి పర్యవేక్షణలో "కెపాసిటీ బిల్డింగ్ ఆఫ్ మునిసిపల్ కార్పొరేటర్స్ అండ్ కౌన్సిలర్స్ టువర్డ్స్ అర్బన్ గుడ్ గవర్నెన్స్; ఎ స్టడీ ఆఫ్ తెలంగాణ స్టేట్" అనే అంశంపై శేఖర్ పరిశోధన చేశారు. పట్టణ సుపరిపాలన దిశగా మున్సిపల్ కార్పొరేటర్లు, కౌన్సిలర్ల సామర్థ్య నిర్మాణంపై ఆయన చేసిన విశ్లేషణాత్మక పరిశోధనకు డాక్టరేట్ లభించింది.సామాజిక న్యాయం కోసం మూడు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్న మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్)లో శేఖర్ నాయకుడిగా ఎదిగారు. ఓయూ అధ్యక్షుడిగా, పలు జిల్లాల ఇన్‌చార్జిగా సేవలందించిన ఆయన ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం యర్కారం గ్రామానికి చెందిన కొమ్ము శేఖర్ మాదిగ,కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించిన కొమ్ము సరోజ?అంజయ్య దంపతుల కుమారుడు.చిన్నతనం నుంచే విద్యపై ఆసక్తి పెంచుకున్న ఆయన స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి వరకు చదివారు. అనంతరం ఎల్‌బీనగర్‌లో పదో తరగతి, ఇబ్రహీంపట్నంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తిచేశారు.నిజాం కాలేజీలో డిగ్రీ చదువుతున్న సమయంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా చురుకైన పాత్ర పోషించారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పూర్తి చేసి, సామాజిక న్యాయ ఉద్యమంలో కొనసాగుతూనే పీహెచ్‌డీ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేశారు.డాక్టరేట్ పట్టా అందుకున్న సందర్భంగా తనకు స్ఫూర్తినిచ్చిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగతో పాటు తన పరిశోధనకు మార్గనిర్దేశం చేసిన ప్రొఫెసర్ వై. పార్థసారథి, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధ్యాపకులు, సిబ్బందికి శేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.విద్యను ఆయుధంగా చేసుకుని సామాజిక న్యాయ ఉద్యమంలో కొనసాగుతూ ఉన్నత విద్యలో డాక్టరేట్ సాధించిన కొమ్ము శేఖర్ మాదిగను ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

# మాజీ మున్సిపల్ చైర్మన్ బి. లింగం గౌడ్ 12వ వర్ధంతి ఘనంగా నిర్వహణ

### కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, మేడ్చల్?మల్కాజిగిరి జిల్లా,

హైదరాబాద్ సెప్టెంబర్ 8 :కుత్బుల్లాపూర్ నియోజకవర్గంకుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్, కీర్తిశేషులు బి. లింగం గౌడ్ 12వ వర్ధంతి సందర్భంగా రోడా మేస్త్రి నగర్ డివిజన్‌లోని శ్రీరామ్ నగర్?ఏలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు, అభిమానులు, లింగం గౌడ్ యువసేన సభ్యులు ఆయన సేవలను స్మరించుకున్నారు. ప్రజా సేవలో బి. లింగం గౌడ్ చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పలువురు పేర్కొన్నారు.కార్యక్రమానికి లింగం గౌడ్ యువసేన అధ్యక్షులు పెద్దబాల్ అంజన్ గౌడ్, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో నేమూరి రమేష్ గౌడ్ శింగారం మల్లేష్, నేమూరి సతీష్ గౌడ్, సురిగి లక్ష్మణ్ గౌడ్, బూసి రెడ్డి, మల్లారెడ్డి, నేమూరి నరేష్ గౌడ్, కోలా శ్రీనివాస్ గౌడ్, బద్రి వెంకట రమణయ్య, బండ సిద్దులు, శ్రీనివాసులు గుప్తా తదితరులు పాల్గొని బి. లింగం గౌడ్ విగ్రహానికి



పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# కేంద్ర కనీస వేతన సలహా బోర్డులో సీఐటీయూకు ప్రాతినిధ్యం కల్పించాలి

### కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను కేంద్రం విడనాడాలి
### సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి మీసాల శ్రావణ్ కుమార్

సైదాబాద్, జ్యోతి ప్రభంజనం,సెప్టెంబర్ 09:కేంద్ర కనీస వేతన సలహా బోర్డు పునర్వ్యవస్థీకరణలో ప్రధాన కేంద్ర కార్మిక సంఘమైన సీఐటీయూకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు నిదర్శనమని సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి మీసాల శ్రావణ్ కుమార్ విమర్శించారు.కనీస వేతన సలహా బోర్డు నుంచి సీఐటీయూను మినహాయించిన కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా సంతోష్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో బీడీ ఎల్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీసాల శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. కార్మికుల కనీస వేతనాలు, జీవన ప్రమాణాలు, ఉపాధి పరిస్థితులకు సంబంధించిన కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకునే వేదికలో ప్రధాన కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం లేకపోవడం అప్రజాస్వామికమన్నారు.త్రైపాక్షిక వేదికగా బోర్డు ఉండాలిబీడీ ఎల్ బీడీఈ యు అధ్యక్షుడు మురళి, జనరల్ సెక్రెటరీ టి. సత్తయ్య మాట్లాడుతూ.. కేంద్ర కనీస వేతన సలహా బోర్డు కార్మికులు, యాజమాన్యం, ప్రభుత్వం భాగస్వామ్యంతో పనిచేసే సమర్థవంతమైన త్రైపాక్షిక వేదికగా ఉండాలని అన్నారు.సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ వంటి ప్రధాన కేంద్ర కార్మిక సంఘాలను పక్కనపెట్టి బోర్డును పునర్వ్యవస్థీకరించడం వల్ల కార్మికుల ప్రయోజనాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల వేతనాలు, హక్కులకు సంబంధించిన నిర్ణయాల్లో కార్మిక సంఘాల అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్మికుల గొంతును అణచివేయొద్దులేబర్ కోడ్ల పేరుతో



ఇప్పటికే కార్మికుల హక్కులను హరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని నాయకులు ఆరోపించారు. ఇప్పుడు కనీస వేతనాల నిర్ణయ ప్రక్రియలోనూ కార్మిక సంఘాల గొంతును నొక్కివేయడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని కనీస వేతన సలహా బోర్డులో సీఐటీయూతో పాటు అన్ని ప్రధాన కేంద్ర కార్మిక సంఘాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ బీడీఎల్ కోశాధికారి రవీందర్, డి ఆర్ టి యూనియన్ నాయకులు దానకర్ణాచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీలక్ష్మి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# హైవేపై హోటల్స్ లో అధికారుల తనిఖీలు

### బ్లూ ఫాక్స్ మినర్వాలో 55 కిలోల నాణ్యత లేని ఆహారం ధ్వంసం..



చిట్యాల,నల్లగొండ, జ్యోతి ప్రభంజనం,సెప్టెంబర్ 09:ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించేందుకు చిట్యాల మండల పరిధిలోనీ జాతీయ రహదారి?65 వెంట గల హోటళ్లు, ధాబాలు, రెస్టారెంట్లు, కేఫ్‌లలో బుధవారం ఆహార పరిరక్షణ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి పర్యవేక్షణలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఎన్.శివశంకర్‌రెడ్డి తనిఖీలు చేపట్టారు.చిట్యాల పట్టణంలోని బ్లూ ఫాక్స్ మినర్వా కేఫ్‌లో తనిఖీల సందర్భంగా ఆహార పదార్థాల నిల్వ, ముడి?వండిన పదార్థాల విభజన, ఉష్ణోగ్రత నియంత్రణ, వంటగది పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ తదితర అంశాల్లో పలు లోపాలను గుర్తించారు. గడువు ముగిసిన, నాణ్యత లేని గ్రేవీలు, మాంసం, అల్లం, మాంసం ఉత్పత్తులు, మంచూరియా తదితర 55 కిలోల ఆహార పదార్థాలను ధ్వంసం చేశారు. కేఫ్‌కు నోటీసు జారీ చేసి, ఆరు ఆహార నమూనాలను విశ్లేషణ కోసం సేకరించారు.ఆహార పరిరక్షణ నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి హెచ్చరించారు. హోటళ్లు, ధాబాలు, రెస్టారెంట్ల నిర్వాహకులు పరిశుభ్రత, సరైన నిల్వ విధానాలు, నిర్ణీత ఉష్ణోగ్రతలు, గడువు తేదీలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. జాతీయ రహదారి?65పై తనిఖీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# ఉపాధ్యాయుల సేవలకు లయన్స్ ఘన సత్కారం

రంగారెడ్డి జిల్లా జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,సెప్టెంబర్ 08:సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైనదని, వారు కేవలం విద్యను బోధించేవారు మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు దిశానిర్దేశం చేసే మహనీయులని వక్తలు కొనియాడారు.జిల్లా కోఆర్డినేటర్ లయన్ తాలింఖానా సతీష్, ఈవెంట్ ఛైర్పర్సన్ లయన్ భరత్ రాజ్ వల్లనీ ఆధ్వర్యంలో నిర్వహించిన లయన్స్ టీచర్స్ హానరింగ్ ప్రోగ్రామ్" ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బ్రహ్మశ్రీ శతసాహస్రవధాని గరికిపాటి నర్సింహారావు ని,లయన్స్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గరికిపాటి మాట్లాడుతూఒక మంచి ఉపాధ్యాయుడు ఒక విద్యార్థి జీవితాన్ని మార్చగలడు?ఒక మంచి విద్యార్థి ఒక కుటుంబాన్ని మార్చగలడు?మంచి కుటుంబాలు కలిసి ఒక సమాజాన్ని మార్చగలవు?అందుకే సమాజ మార్పుకు అసలైన శిల్పులు ఉపాధ్యాయులే" అని అన్నారు.విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు విలువలు, క్రమశిక్షణ, మానవతా దృక్పథం, దేశభక్తి వంటి సుగుణాలను అందిస్తున్న ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 320ఏ జిల్లా గవర్నర్, సురేష్ జగ్గని, ఉపాధ్యాయుల సేవలను గుర్తించి వారిని గౌరవించడం లయన్స్ సంస్థ సామాజిక బాధ్యతలో ఒక ముఖ్యమైన భాగమని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పీడీజీ లు లయన్స్




నాయకులు, ఉపాధ్యాయులు, మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు."గురువు వెలిగించిన జ్ఞానదీపం?తరతరాలకు వెలుగునిచ్చే మహాజ్యోతి."ఉపాధ్యాయుల సేవలకు గౌరవం, వారి కృషికి గుర్తింపు, విద్యారంగానికి ప్రోత్సాహం అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

printed and published by **Rapolu Lingaswamy**,onbehalf of printed at **SMILYS ONLINE** 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana **Editor: Rapolu Lingaswamy.pone:9908103501,** PRGI **NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com**